సాక్షి
సిద్దిపేట
శనివారం : 21 : జనవరి : 2023



పోదాం పద కొండపోచమ్మ జాతరకు
కోరిన కోర్కెలు తీర్చే కొండపోచమ్మ జాతర ఈనెల 22 నుంచి ప్రారంభం కానుంది. జాతరకు వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. 8లో..



మహిళలను కత్తితో బెదిరించి..
ఇంట్లోకి చొరబడి మహిళలను కత్తితో బెదిరించి నగలు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని చింతల్ చెరువు గ్రామంలో జరిగింది. 8లో..



వరి సాగులో సస్యరక్షణ అవసరం
యాసంగిలో వరి సాగు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని తోర్నాల సెంటర్ శాస్త్రవేత్త విజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు వారికి అవగాహన కల్పించరాఉ. 9లో..

న్యూస్‌రీల్

ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సిద్దిపేటరూరల్: ఈ నెల 25వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి, వికాస్ రాజ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిక్ కార్డుకు ఆధార్ అనుసంధానం, ఫొటో సిమిలర్ ఎంట్రీ, ఎపిక్ కార్డుల పంపిణీపై తగు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మొదటిసారి ఓటు హక్కును పొందిన నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులు అందజేసి సన్మానించాలన్నారు. ఓటర్ నమోదు కార్యక్రమంలో అత్యుత్తమ విధులు నిర్వహించిన ఎన్నికల అధికారులకు అవార్డులను అందించాలన్నారు. ఇంటింటి సర్వే చేసి ఓటర్ కార్డులో పొటో, పేరు సరిచేయడం, డబుల్ కార్డుల తొలగింపు, చిరునామా సరి చేయడం తదితర మార్పులను పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా జిల్లాలకు పంపించిన ఎపిక్ కార్డుల పంపిణీ పోస్టల్ శాఖ వారి సహకారంతో త్వరగా పూర్తి చేయాలన్నారు.

రెండో రోజు 6,729 మందికి పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దిపేటకమాన్: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రెండో రోజు శుక్రవారం 45 బృందాల వైద్య సిబ్బంది 6,729 మందికి పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అవసరమైన 2,468 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు, మరో 1,165 మందికి అద్దాలు ఆర్డర్ పెట్టినట్లు తెలిపారు.

'పర్యావరణం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల అధ్యాపకులు రచించిన ఎన్విరాల్‌మెంటల్ స్టడీస్ పుస్తకాన్ని శుక్రవారం స్థానిక కళాశాలలో ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాల జీవసాంకేతిక, వృక్షశాస్త్ర విభాగాల అధ్యాపకులు డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ శైలజ, డాక్టర్ రాణి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు సంబంధించిన డిగ్రీ ప్రథమ సంవత్సరం సిలబస్‌కు అనుగుణంగా దీన్ని రూపొందించారన్నారు. అన్ని గ్రూపుల విద్యార్థులకు పర్యావరణం విషయంలో ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగ పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ మధుసూదన్, అధ్యాపకులు డాక్టర్ వాసం శ్రీనివాస్, డాక్టర్ పల్లవి, అంజనేయులు, డాక్టర్ కె.శ్రీనివాస్, సలీంపాష, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

పట్నం వారానికి భారీ బందోబస్తు

- మల్లన్న జాతర విధుల్లో 273 మంది పోలీస్‌లు, సిబ్బంది
- పోలీస్ కమిషనర్ శ్వేత



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ శ్వేత, అదనపు డీసీపీ మహేందర్ తదితరులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల్లో మొదటి పట్నం ఆదివారానికి భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. శుక్రవారం ఆమె ఆలయ పరిసరాలు, పార్కింగ్, తోటబావి ప్రాంతాన్ని పరిశీలించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. స్వామి దర్శనానికి ఇబ్బంది లేకుండా వీఐపీ, శీఘ్ర, సాధరణ దర్శనాలుగా విభజించామని తెలిపారు. ఆలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాల వద్ద 80 సీసీ కెమెరాలను



పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న సీపీ శ్వేత

ఏర్పాటు చేశామన్నారు. జాతరలో ఇద్దరు ఏసీపీలు, 14 మంది సీఐలు, 17 మంది ఎస్ఐలు ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్, మహిళా కానిస్టేబుల్స్ మొత్తం 273 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. వీరితో పాటు 180 మంది ఎన్‌సీసీ విద్యార్థులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇలా..

తోటబావి సమీపంలో ఎడమవైపు ప్రహరిలో వీఐపీ పార్కింగ్, చేర్యాల కిష్టంపేట, సిద్దిపేట, కొమురవెల్లి కమాన్ నుంచి వచ్చే వాహనాలను బస్టాండ్ పక్కన గాజుల కిష్టయ్య ఖాళీ స్థలంలో, హైదరాబాద్, ప్రజ్ఞాపూర్, కొడకండ్ల, చిన్నకిష్టపూర్, కొండపోచమ్మ టెంపుల్ నుంచి వచ్చే వాహనాలను పద్మశాలి నిత్యాన్నదాన సత్రం ఎడమ వైపున ఉన్న ఖళీ స్థలంలో పార్కింగ్ చేయించాలని పోలీస్‌లకు సూచించారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలు, సలహాలు పాటించి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని భక్తులను కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) మహేందర్, హుస్నాబాద్ ఏసీపీ మహేందర్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, చేర్యాల సీఐ శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి చేద్దాం

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రోజాశర్మ

సిద్దిపేటజోన్: జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, మార్కెటింగ్, అటవీశాఖ, ఆబ్కారీ, చేనేత, జౌళి, యువజన సంక్షేమ శాఖల పనితీరు పై స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగుపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పామాయిల్ సాగుకు డీడీలు కట్టిన రైతులకు త్వరితగతిన మొక్కలు అందించాలని సూచించారు. అలాగే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు.

గంజాయి సాగు పై కట్టడి...

జిల్లాలో గంజాయి సాగు ఇటీవల గ్రామాల్లో విచ్చలవిడిగా సాగు చేస్తున్నట్టు ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్నన్న నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో దీన్ని కట్టడి చేయాలన్నారు. గంజాయి సాగు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, జెడ్పీ సీఈఓ రమేశ్, జెడ్పీటీసీలు శ్రీహరిగౌడ్, లక్ష్మి, శ్యామల, కొండల్‌రెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఇటీవల హత్యకు గురైన చేర్యాల జెడ్పీటీసీ మల్లేశం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

భూ పోరాటాలు ఉధృతం చేస్తాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ

హుస్నాబాద్: పేదలకు భూ పంపిణీ చేసేందుకు సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అనబేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికి పక్కా ఇళ్లను మంజూరు చేయాలన్నారు. 8 ఏళ్ల కాలంలో కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వలేదన్నారు. ధరణి పోర్టల్‌లో అనేక లోసుగులు ఉన్నాయని, వాటిని తొలగించి భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ పూర్వ వైభవానికి ఉద్యమాలను రూపకల్పన చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస రావు, జిల్లా కార్యదర్శి మంద పవన్, మర్రి వెంకట స్వామి, కర్రె భిక్షపతి, గడిపె మల్లేశ్, కోయ్యడ సృజన్ కుమార్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా వివేక్‌వర్ధన్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జిల్లా కన్వీనర్ గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బీరకాయల వివేక్‌వర్ధన్ నియమితులయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ప్రాంత సమావేశంలో రాష్ట అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి జిల్లా కన్వీనర్‌గా వివేక్‌ను నియమించారు.

పామాయిల్ రైతులకు చేయూత



పామాయిల్ తోటను పరిశీలిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పామాయిల్ రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా పోత్సహిస్తుందని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో పామాయిల్ తోటను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డితో కలిసి రైతులు, ప్రజా ప్రతినిధులు, హార్టీకల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో పామాయిల్ సాగుకు అనువైన వాతావరణం ఉందన్నారు. సిద్దిపేట సమీపంలో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తుండటంతో రైతులకు మంచి సౌకర్యం ఏర్పడిందన్నారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు అందిచాలని ఆదేశించారు. దుబ్బాక ప్రాంతం ఈ సాగుకు అనువైన నేలలున్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురుకి సీఎం సహయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ఎంపీపీ సాయిలు, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కరాచారి, కొమురయ్య, రాంరెడ్డి, కనకయ్య, సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, లీలాదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివ ప్రసాద్, ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మూల మహోత్సవం





విశేషాలంకరణలో వర్గల్ సరస్వతి అమ్మవారు, సామూహిక లక్షపుష్పార్చనలో భక్తులు

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి కొలువుదీరిన వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్రం శుక్రవారం మూల మహోత్సవ వేడుకలతో అలరారింది. ఈ పర్వదినం సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, లలితాపారాయణం, సప్తశతీ పారాయణం, చండీహోమం నిర్వహించారు. చతుషష్ట్యోపచార పూజలు, కుంకుమార్చన చేశారు. సామూహిక లక్ష పుష్పార్చన జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కంటివెలుగును విజయవంతం చేయాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

గజ్వేల్: 'కంటి వెలుగు' శిబిరాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వందశాతం విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ ఆదేశించారు. శుక్రవారం అహ్మదీపూర్‌లో కొనసాగుతున్న శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): కంటి వెలుగు శిబిరంలో ప్రతీరోజు 150 మందికి పరీక్షలు చేయాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఇటిక్యాల, అనంతసాగర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను కలెక్టర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడి టీచర్లు, గర్భిణులు, డ్వాక్రా మహిళలను సీఏ, సీసీలు ఈ శిబిరానికి తీసుకవచ్చి కంటి పరీక్షలు చేయించేలా చూడాలన్నారు. ఎంపీపీ బాలేషం గౌడ్, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు లావణ్య మల్లేశం, చంద్రశేఖర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

ములుగు(గజ్వేల్): ములుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ ప్రశాంత్‌జీవనపాటిల్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయరాణి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ బట్టు మాధవి, సెక్రటరీ శాంతి, జుబేర్‌పాషా పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి



హెల్త్‌క్యాంపులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, వైద్య సిబ్బంది

సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ రఘురాం సూచించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నందున ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. హెల్త్ క్యాంపులో సుమారు 300 మందికి పైగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి భవాని, లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

టీటీసీ పరీక్ష షెడ్యూల్ విడుదల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) పరీక్ష షెడ్యూల్ విడుదలైందని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 14 వరకు ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్

- సిద్దిపేటలో జిల్లా స్థాయి టీఎల్ఎం కార్యక్రమం
- 296 ప్రదర్శనల్లో 10 రాష్ట్ర స్థాయికి ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు ఉంటారని, ప్రతీ విద్యార్థి భవిష్యత్ తరగతి గదుల్లోనే నిర్ణయించబడుతుందని, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బోధనాభ్యాసన సామగ్రి మేళా(టీఎల్ఎం) శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఉర్దూ, పరిసరాల పరిజ్ఞానానికి సంబంధించిన ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని రోజాశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సెంట్రల్ స్వేర్ ఫౌండేషన్ ఢిల్లీ ప్రతినిధులు దీపక్, శాలెట్, ఈశ్వర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి కలిసి ప్రారంభించారు. ముగింపు సమావేశానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థి ఉత్తమంగా రాణించేందుకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమన్నారు. ఇందులో తొలిమెట్టు, ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎంలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ టీఎల్ఎం మేళాలో జిల్లాకు చెందిన పాఠశాలల నుంచి 296 ప్రదర్శనలు రాగా, అందులో తెలుగు నుంచి రెండు, ఇంగ్లిష్ రెండు, ఉర్దూ రెండు, గణితం రెండు, పరిసరాల పరిజ్ఞానం నుంచి రెండు మొత్తంగా పది ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి.



జిల్లా స్థాయి టీఎల్ఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రదర్శనలు

తెలుగు విభాగం:

చక్రం తిప్పు పదం పట్టు



తెలుగు విభాగంలో పీఎస్ గౌరారం(అక్కన్నపేట)లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు సునీత చక్రం తిప్పు పదం పట్టు టీఎల్ఎంను రూపొందించారు. దీని ద్వారా సులువుగా చక్రం తిప్పుతూ పదంను గుర్తించే విధంగా రూపొందించారు.

పదాల ఏటీఎం



ఎంపీపీఎస్ ఇందిరానగర్(తొగుట మండలం)లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు స్వప్న రూపొందించారు. విద్యార్థులు తమకు కావాల్సిన పదాలను ఈ ఏటీఎం నుంచి సేకరించే అవకాశం ఉంది.

ఉర్దూ విభాగం:

మూవింగ్ లెటర్



సిద్దిపేట జీపీఎస్ నంబర్ 6లో ఉర్దూ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సలీమ్ రూపొందించిన మువింగ్ లెటర్ ప్రదర్శన విద్యార్థులు అక్షరాలను కదిలిస్తూ పదాలను తయారు చేయు విధంగా ఉంది.

జోడ్ తోడ్



సిద్దిపేట జీపీఎస్ నంబర్ 2 లో ఉర్దూ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రషీద్ 'జోడ్ తోడ్'ను రూపొందించారు. దీని ద్వారా విద్యార్థులకు భాష నేర్చుకునే ఉత్సాహం పెరుగుతుంది.

ఇంగ్లిష్ విభాగం:

సెంటెన్స్ ఫార్మేషన్ విత్ ఫిష్ పాండ్



యూపీఎస్ నాంచారుపల్లిలో విధులు నిర్వహిస్తున్న స్రవంతి సెలెక్ట్ ఫార్మేషన్ విత్ ఫిష్ పాండ్‌ను రూపొందించారు. వివిధ అంతస్తులలో అక్షరాలను ఉంచి విద్యార్థుల ద్వారా పదాలను తయారు చేయించడం దీని ఉద్దేశం.

ఫన్ గేమ్



పీఎస్ రామునిపట్ల (చిన్నకోడూరు)లో విధులు నిర్వహిస్తున్న సువర్ణదేవి ఫన్ గేమ్ అనే టీఎల్ఎంను రూపొందించారు. దీని ద్వారా అక్షరాలను గుర్తిస్తూ పదాలను తయారు చేస్తారు.

గణిత విభాగం:

మ్యాజిక్ బోర్డు



యూపీఎస్ చందాపూర్(తొగుట)లో విధులు నిర్వహిస్తున్న సిద్దేశ్వర్ సంఖ్యలతో కూడిన మ్యాజిక్ బోర్డును తయారు చేశారు. దీంతో సులువుగా గణిత సంబంధిత లెక్కలు చేసే అవకాశం ఉంది.

మ్యాథమెటిక్స్ బేసిక్ కాన్సెప్ట్



పీఎస్ పాములపర్తి(మర్కూక్)లో విధులు నిర్వహిస్తున్న జైపాల్‌రెడ్డి మ్యాథమెటిక్స్ బేసిక్ కాన్సెప్ట్‌ను నేర్చుకునే విధంగా ప్రాజెక్టును రూపొందించారు. ప్రైమరీ స్థాయి విద్యార్థులు దీంతో గణితం సులువుగా నేర్చుకునే అవకాశం ఉంది.

పరిసరాల విజ్ఞానం:

మానవ శరీరం అంతర్గత అవయవాలు



యూపీఎస్ కొత్తపల్లి (రాయిపోల్)లో విధులు నిర్వహిస్తున్న నాగరాజు మానవ శరీరంలో అంతర్గతంగా ఉన్న అవయవాలను వివరించే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు.

మార్బుల్ బిజినెస్ కాన్సెప్ట్ గేమ్



పీఎస్ పెద్దకోడూరు (చిన్నకోడూరు)లో విధులు నిర్వహిస్తున్న శోభారాణి ఈ కాన్సెప్ట్ గేమ్‌ను రూపొందించారు. విద్యార్థుల ప్రవర్తనను తెలుసుకుని, వారికి ఇష్టమైన విధంగా పరిసరాల పరిజ్ఞానం బోధించడం దీని లక్ష్యం.

పోదాంపద కొండపోచమ్మ జాతర

- రేపటి నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం
- ఉగాది వరకు వైభవంగా జాతర
- ముస్తాబైన దేవాలయం
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



కొండ పోచమ్మ దేవాలయం



కొండపోచమ్మ అమ్మవారు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పచ్చని పొలాలు.. పక్షుల కిలకిలలు.. ఎత్తయిన నల్లని గుట్టలు.. పల్లె జనానికి కోరిన కోర్కులు తీర్చే కల్పవల్లి. కొండపోచమ్మ దేవాలయం ఉత్సవాలకు ముస్తాబైంది. కొమురవెల్లి మల్లన్నకు కోటి దండాలు.. కొండపోచమ్మకు ముక్కోటి దండాలు.. కరుణించి కాపాడే తల్లి పోచమ్మ..శతకోటి దండాలు..అంటూ భక్తులు అమ్మవారి నామస్మరణతో దర్శించుకుంటారు. మూడు నెలల పాటు అంగరంగ వైభవంగా కొండ పోచమ్మ జాతర కొనసాగుతుంది. తెలంగాణ లోనే ప్రసిద్ధి గాంచిన శ్రీ కొండపోచమ్మ దేవస్థానం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల పరిధి తీగుల్ నర్సపూర్ గ్రామానికి ఉత్తర దిశలో ఉంది. కొండపోచమ్మ నామంతో జగన్మాత శీలాదేవి భక్తుల పూజ లందుకుంటుంది. ఉత్సవాలు 22న ప్రారంభమై ఉగాది వరకూ జరుగుతాయి. జాతరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి వరంగల్, నల్గొండ. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు.

ఆలయచరిత్ర

కొండపోచమ్మ ఆలయం హైదరాబాద్–కరీంనగర్ రాజీవ్ రహదారి మధ్యగల కొండకండ్ల గ్రామం నుంచి 16 కిలో మీటర్ల దూరంలో ఉంది. సంతానం లేనివారు అమ్మవారిని దర్శించుకుంటారు. అమ్మవారు చేర్యాల మండల పరిధి కొమురవెల్లి మల్లికార్జునస్వామికి చెల్లెలని ప్రతీతి. కొన్ని వందల ఏళ్ల క్రితం కొండపోచమ్మ కూడా కొమరవెల్లిలోనే ఉండేదని భక్తుల నమ్మకం. ఒక సందర్భంలో అలిగి తీగుల్ నర్సపూర్‌లోని అడవుల్లో స్థిరపడగా అన్న మల్లన్న తన సోదరి పోచమ్మ జాడ తెలుసుకొని వస్తాడు. ఇంటికి పోదామని కోరగా ఆమె మొండికేయడంతో, మల్లన్న ఏం వరం కావాలో కోరుకోమన్నాడట. అప్పుడు పోచమ్మ కొమరవెల్లికి వచ్చే ప్రతీ భక్తుడూ తన వద్దకు వచ్చి దర్శనం చేసుకునేలా వరమివ్వాలని కోరిందట. అలా మల్లన్న ఇచ్చిన వరంతో కొమరవెల్లి కొచ్చే యాత్రికులు కొండపోచమ్మను దర్శించుకుంటారు.

ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించామని దేవాలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్, జనగామ బస్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఆది సోమ, మంగళవారాల్లో ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు.

ఆకర్షించే లష్కర్ బోనాలు

జాతరకు వచ్చే భక్తులు దేవాలయం వద్ద ఉన్న చెరువులో పుణ్యస్నానాలాచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. అమ్మవారి బోనాన్ని పసుపు, కుంకుమలతో అలంకరించి ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి తెస్తారు. వాటిలో రాష్ట్ర రాజధాని హైద్రాబాద్, సికింద్రాబాద్ భక్తులు తెచ్చే బోనాలు ప్రత్యేక ఆకర్షణ.



దత్తాత్రేయ ఆలయం

దత్తాత్రేయ ఆలయం ముస్తాబు

నంగునూరు(సిద్దిపేట): ఏటా మాఘ అమావాస్య నాడు పాలమాకులలో జరిగే బండమీది జాతరకు దత్తాత్రేయుడి ఆలయం ముస్తాబైంది. నాలుగు గ్రామాల శివారు కూడలిలో ఉన్న ఆలయాన్ని సంవత్సరానికి ఒకరోజు మాత్రమే తెరిచి సాయంత్రం మూసివేయడం ప్రత్యేకత. ఆలయ ప్రాంగణంలో హరి నామం ఆకారంలో వెలసిన పవిత్ర గుండంలో స్నాన మాచరిస్తే పీడ బాధలు తొలుగుతాయని గ్రామస్తుల నమ్మకం. శనివారం జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ధర్మకర్తలు చీకోటి వంశస్తులు, గ్రామస్తులు తెలిపారు. పాలమాకుల శివారులో మునులు తపస్సు చేసినందున ఈ ప్రాంతాన్ని మునుల బండగా పిలుస్తారు. వారు స్నానం, పూజలు, జపం చేసుకునేందుకు బండపై దత్తాత్రేయ ఆలయాన్ని నిర్మించి రెండు నీటి గుండాలను తవ్వించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఆలయం శిథిలావస్థకు చేరడంతో చీకోటి వంశస్తులు పునరుద్ధరించారు. అప్పటి నుంచి ఏటా మాఘ అమావాస్య రోజున ఆలయ ధర్మకర్తలు ఉదయం గుడి తెరిచి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించడంతో జాతర ప్రారంభమవుతుంది. చీకటి పడగానే పూజలు నిర్వహించి ఆలయాన్ని మూసివేస్తారు. స్వామి వారిని దర్శించుకోవాలంటే ఏడాది వేచి చూడాల్సిందే.



ఆలయంలో కొలువైన దత్తాత్రేయ స్వామి

క్లుప్తంగా

కేరళ రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ సందర్శన



కేరళ రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సంగారెడ్డిటౌన్: డీసీసీబీ బృందంతో కేరళ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్‌ను శుక్రవారం సందర్శించినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి తెలిపారు. కేరళలో రైతులకు బ్యాంకు సేవలు ఏ విధంగా అందుతున్నాయి, లావాదేవీలను తెలుసుకునామన్నారు. కేరళ వెళ్లినవారిలో రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్, ఇతర రాష్ట్ర డీసీసీబీ చైర్మన్లను సన్మానించామని తెలిపారు. కేరళ వెళ్లినవారిలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, డిస్ట్రిక్ట్ కోపరేటివ్ ఆఫీసర్స్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



భాగ్యలక్ష్మి (ఫైల్)

టేక్మాల్(మెదక్): ఛాతి నొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన టేక్మాల్ మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బేగరి రాజు, మాణెమ్మ దంపతులు మండలంలోని దనూర రైస్‌మిల్లులో పనిచేస్తున్నారు. వారి కూతురు బేగరి భాగ్యలక్ష్మీ(12) అదే గ్రామంలోని ఉంటున్న నాయనమ్మ దగ్గర ఉంటూ టేక్మాల్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఛాతినొప్పితో బాధపడుతుండటంతో వైద్యం చేయించారు. రోజులాగే పాఠశాలకు వెళ్లి వచ్చింది. గురువారం రాత్రి ఒంటరిగానే నిద్రించింది. తెల్లారి చూసేసరికి ఉరివేసికొని కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. భాగ్యలక్ష్మీ మృతితో టేక్మాల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంతాపం తెలిపారు. మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు.

చెరువులో దూకి..

టేక్మాల్(మెదక్): చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం ఏఎస్‌ఐ తుక్కయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలంలోని సాలోజిపల్లి గ్రామానికి చెందిన దండుగుల శ్రీనివాస్ (18) కూలీ పనులు చేస్తున్నాడు. మృతుడి తండ్రి దుర్గయ్య, అన్న భీమయ్య కూడా ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి మనస్తాపంతో పలుమార్లు ఆత్మహత్యకు యత్నించగా గ్రామస్తులు కాపాడారు. గురువారం సాయంత్రం గ్రామ శివారు చెరువులోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం శవమై తేలాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల మృతితో తల్లి నాగమ్మ అనాథగా మారింది. ఆమెను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో..



అశోక్ (ఫైల్)

దుబ్బాక: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోనాపూర్ గ్రామానికి చెందిన సూరంపల్లి అశోక్ (28) పత్తి సాగుచేశాడు. తీవ్ర నష్టం వాటిల్లడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. దౌల్తాబాద్ ఎస్‌ఐని సాక్షి వివరణ కోరగా ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

అస్సాం అధికారుల మల్లన్న సాగర్ సందర్శన



మల్లన్న సాగర్‌ను పరిశీలిస్తున్న అస్సాం ఇంజనీర్లు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను అస్సాం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు శనివారం సందర్శించారు. రిజర్వాయర్ నిర్మాణం, ఎత్తిపోతలు తదితర అంశాలను ఈఎన్సీ హరిరాం వారికి వివరించారు. 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మాణంతో ఆరు గ్రామాలు ముంపునకు గురైనట్టు తెలిపారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు మెరుగైన పరిహారం చెల్లించి, వారికి గజ్వేల్ పట్టణ శివారులో ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులతో వ్యవసాయ రంగానికి సాగునీరు, తాగునీరు అందిస్తుందన్నారు. అధికారుల వెంట ఈఈ సాయిబాబా, డీఈ శ్రీనివాస్ ఉన్నారు.

టైర్ పంక్చర్ .. వాహనం బోల్తా

ముగ్గురికి తీవ్ర గాయాలు

జోగిపేట(అందోల్): అందోల్ మండల పరిధి సంగుపేట వద్ద జాతీయ రహదారిపై టైర్ పంక్చర్ కావడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శుక్రవారం నాడు మియాపూర్ నుంచి ఒకే కుటుంబానికి చెందిన కుమ్మరి మాణయ్య, కుమ్మరి సరస్వతి, కుమ్మరి చంద్రకాంత్ స్కార్పియో వాహనంలో మెదక్ జిల్లా రేగోడులోని కూతురు వద్దకు బయలుదేరారు. మార్గ మధ్యలో సంగుపేట సమీప జాతీయ రహదారిలో వాహనం ముందు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కుమ్మరి సరస్వతి, ఆమె భర్త మాణయ్య, కొడుకు చంద్రకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వాహనాన్ని క్రేన్‌తో పక్కకు తీస్తున్న దృశ్యం

ఇద్దరు అదృశ్యం



సంగమేశ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్యభర్తలు గొడవ పడిన సంఘటనలో భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన సంగమేశ్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 10వ తేదీన భార్యాభర్తలు సంగమేశ్, మాధవి గొడవ పడ్డారు. 11వ తేదీ ఉదయం నిద్రలేచి చూసేసరికి సంగమేశ్ కనిపించలేదు. దీంతో భర్త కోసం భార్య బంధువులను, తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి వెళ్లిన బాలిక..

పటాన్‌చెరు టౌన్: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్ రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరులోని గోకుల్ నగర్ కాలనీకి చెందిన బాలిక (15) ఈనెల 14వ తేదీన స్నేహితుల వద్దకు వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. బాలిక కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇళ్ల కూల్చివేత వేగవంతం చేయండి

- పరిహారం అందని భూ నిర్వాసితుల వివరాలు సేకరించండి
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



గుడాటిపల్లిలో తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ అనంతరెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన భూ నిర్వాసితుల ఇళ్ల కూల్చివేత వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కొన్ని రోజులుగా తహసీల్దార్ సంజీవ్‌కుమార్ ఆదేశాల మేరకు భూ నిర్వాసితుల ఇళ్లకు రెవెన్యూ అధికారులు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్, ఆర్డీఓ అనంతరెడ్డి గుడాటిపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించామన్నారు. గుడాటిపల్లి భూ నిర్వాసితుల త్యాగాలు మరవలేనిదన్నారు. పెళ్లయిన యువతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ కింద పరిహారం తమ పరిధిలో లేదన్నారు. ప్రభుత్వం నుంచి ఏదైనా ఆదేశాలు వస్తేకానీ తాము ఏమీ చేయలేమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజునాయక్, గ్రామ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, కాంట్రాక్టర్ ముత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు శుక్రవారం జరిమానా విధించింది. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఐదుగురు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా జడ్జి రమేశ్‌బాబు రూ.12 వేల జరిమానా విధించారు.

అధికారులపై తేనెటీగల దాడి

ఝరాసంగం(జహీరాబాద్): సర్వేకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. మండల పరిధిలోని బిడెకన్నె గ్రామం శివారులోని అసైన్డ్ భూముల్లో పొజిషన్‌పై ఉన్నవారి వివరాల సేకరణకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గిర్దావర్ రామారావు, సర్వేయర్ లాల్ సింగ్, వీఆర్‌ఏలు హకీం, విఠల్, నాయకులు సంజీవ్, మల్లన్న, పలువురు గ్రామస్తులపై తేనెటీగలు దాడి చేశాయి. గాయపడిన వారికి చికిత్స కోసం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి



సురేశ్ (ఫైల్)

నిజాంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన దండు సురేశ్ (37) సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం అక్బర్‌పేట శివారులో బైక్ అదుపు తప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తల్లిదండ్రులకున్న ముగ్గురు కుమారులు మూడేళ్లలో ఏడాదికొకరు చొప్పున మృతి చెందారు.

దుబ్బాక: కడుపు నొప్పి భరించలేక ఆటోడ్రైవర్ ఆత్మహ్యతకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. దుబ్బాక ఎస్‌ఐ వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మున్సిపల్ పరిధి దుంపలపల్లి వార్డుకు చెందిన తలారి చంద్రం (38) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో బుధవారం రాత్రి మద్యంలో ఎండ్రిన్ గుళికలు కలుపుకుని తాగి బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు వివరాలు తెలుసుకుని వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9666572244
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

పాఠశాల సన్నబియ్యంలో పురుగులు

- గోదాం ఇన్‌చార్జిపై ఎంఈఓ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): సన్న బియ్యం స్వాహా, దొడ్డు బియ్యంతో భోజనం శీర్షికతో శుక్రవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు జిల్లా విద్యాధికారి రమేశ్ స్పందించారు. ఎంఈఓ బుచ్చనాయక్‌ను విచారణకు ఆదేశించారు. ఎంఈఓ గాండ్లబాయ్ తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి సాక్షి కథనంపై విచారణ చేపట్టారు. దొడ్డు బియ్యం ఎవరు తెచ్చారు, పాఠశాలకు పంపిణీ చేయాల్సిన సన్న బియ్యం ఎమయ్యాయని ఇన్‌చార్జీ టీచర్ అశ్వరయ్యను అడిగారు. ఇక్కడ పని చేసే టీచర్ భర్త బియ్యం అయిపోతే దొడ్డు బియ్యం బస్తాను తెచ్చినట్లు తెలిపారు. దీంతో వెంటనే సన్న బియ్యం బస్తాను ఎంఈఓ తెప్పించారు. వంట కార్మికులతో మాట్లాడారు. సన్న బియ్యంలోనూ పురుగులు ఉండటంతో ఆయన పెద్దశంకరంపేట పౌరసరఫరాల గోదాం ఇన్‌చార్జితో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ గోదాం నుంచి సరఫరా అవుతున్న బియ్యంపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్‌పై జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.



గాండ్లబాయ్ తండా పాఠశాలలో బియ్యం వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓ

మహిళలను కత్తితో బెదిరించి..

నగలు, నగదు దోపిడీ

హత్నూర (సంగారెడ్డి): ఇంట్లోకి చొరబడి మహిళలను కత్తితో బెదిరించి నగలు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని చింతల్ చెరువు గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్ చెరువు గ్రామానికి చెందిన మొగులపల్లి నరసమ్మ, కుమారుడు లక్ష్మణ్, కోడలు అరుణ(సోని) ఇంటిలో ఉంటున్నారు. గురువారం సాయంత్రం స్నేహితులతో కలిసి లక్ష్మణ్ శ్రీశైలం వెళ్లాడు. కుటుంబ సభ్యులకు శ్రీశైలం వెళ్తున్న విషయం తెలపకపోవడంతో వారు తలుపులకు గడియపెట్టకుండా నిద్రపోయారు. అర్ధరాత్రి ముగ్గురు ముసుగు దొంగలు ఇంటిలోకి చొరబడి నరసమ్మను, అరుణను కత్తితో బెదిరించడంతో వారి బంగారు గొలుసులు, చెవి కమ్మలు, బీరువాలో ఉన్న రూ.1.30 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఇరుగుపొరుగువారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జిన్నారం సీఐ వేణుకుమార్, హత్నూర ఎస్‌ఐ లక్ష్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. తెలిసినవారే దోపిడీకి పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈనెల 14వ తేదీన గ్రామానికి చెందిన బోడ నర్సింహులు ఇంట్లో రూ.1.40 లక్షలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. వరుస దొంగతనాలతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పోలీసు అధికారులు